అపరాధ పరిశోధన

# హోటలు రాకాసితో డిటెక్టివ్ భూతం!

టి. వి. శంకరమ్

సరికొత్త డిటెక్టివు నవల, "చచ్చిపోయిన శవం" చదువుతూ పడుకున్నాను. నవల ప్లాటూ, శంకరంగారు చాలాసేపు మాట్లాడిన విషయాలూ కూడా నా తల్లో గిరగిరా, గిరగిరా తిరుగుతున్నయి. నాకు ఈ తిరుగుడువల్ల కొంచెం కునుకు పట్టినట్టుంది. టెలిఫోన్ మోతకు హఠాత్తుగా ఉలిక్కిపడి లేచాను. నన్ను ఎవరో ట్రంకు చేస్తున్నారు! రిసీవరు ఎత్తి, "అలోవ్! అలోవ్!" అన్నాను.

"అచ్చుతప్పు, గురో!" అన్నాడు భద్రం. వాడు ఎప్పుడొచ్చాడో వచ్చాడు నా పక్క నిలబడ్డాడు.



"ఏమిటదీ?" అన్నాను.

"అలోవ్, కాదు; ఆలోవ్, అనాలి."

"ఆలోవ్, అనాలా?"

"ఖండితంగా, గురో!"

"అలోవ్, అనకూడదా?"

"కూడదు, గురో!"

"అది ఏంతప్పన్నావ్?"

"అచ్చు తప్పులే, గురో!"

"నాన్సెన్స్! నువు నన్ను మాటల్లో పెట్టేస్తివి ఈ లోపల ట్రంకు మాట్లాడకుండా పోతున్నది... అలోవ్!... ఏమిటీ? రాకాసా?... హోటల్ రాకాసా? నన్ను రమ్మన్నారా? ఎవరా డిటెక్టివ్? భూతమా? ఏది? ఆ చచ్చిపోయిన శవం కేసుకట్టి నాయ నేనా? అర్జంటు కేసే? నా సలహా కావాలా? థాంక్ఫుల్, థాంక్ఫుల్! ఇప్పుడే నా ఆటో ఎక్కి బయల్దేరుతున్నా!" అంటూ టెలిఫోన్ పడేశాను.

అంతదాకా నేను మా యింటిని పరీక్షగా చూడలేదు. ఆ ఛాన్సు ఇప్పుడు దొరికింది. నేను నుంచున్నది మా డ్రాయింగు గదికి మళ్లే కనిపించింది. ఒక మూలగా నేను పడుకునే మడతమంచం, దానిమీద విశాలమైన పరుపూ, పరుపుమీద డ్రెస్సింగు టేబులూ, మంచంకింద అయిదారు కుర్చీలూ అవీ ఉన్నయి. గోడలకు అవీ ఇవీ వేళ్ళాడుతున్నయి.

"భద్రం!"

"ఏం గురో?"

"గది ఇంత చల్లగా ఉందేం?"

"ఖండీమండీ గది గదా గురో! ఆ పాటి చలవ ఉండదా?"

"సరే, డిటెక్టివ్ భూతం దేన్నో పట్టాట్ట. మనకి కాలొచ్చింది. హోటల్ రాకాసికి వెంటనే వెళ్ళాలి. నువు రెండు నిమిషాల్లో రెడీ కా!"

"నేను రెండు నిముషాలకిందటే రెడీ, గురో!"

"అయితే దూకు!" అంటూ నేనుకింది అంతస్తులోకి దూకి, నా ఆటో దగ్గరకి పరిగెత్తి అందులోకి దూకాను. ఆటో దూసుకుపోతున్నది. అది హోటల్ రాకాసికి దూసుకుపోతున్నట్టు నేను కనిపెట్టగలిగాను.

అర్ధరాత్రి హోటల్ రాకాసి నిర్మానుష్యంగా ఉంది. నేను మెట్లమీదిగా దూకుతూ నాలుగో అంతస్తుకు వెళ్ళి అక్కడి గోడల్లోకి తీవ్రంగా చూశాను. ఇంతలో నా వీపుమీద ఏదో నిలబడినట్టు గ్రహించగలిగాను. అది లిఫ్టుబోయి చూపులు!

బోయి నన్ను చూసి నవ్వి, "కేయాస్ గారా?" అన్నాడు.

"అవును. ఎట్లా కనుక్కున్నావు?" అడిగాను.

"లాంతర్లల్లే అక్షర్లు తెలీటంలేదా? ఆ రొయ్య దువ్విన జుట్టు, కిటికీ కమ్ములంటి చేతులు— తెలీటంలేదా?"

"డిటెక్టివ్ భూతం ఉండేది ఏగది?" అడిగాను.

అర్థ్మ" చెప్పాడు.

వెంటనే ఆరోనంబరు గదిలోకి దూకాను. స్విచ్ వెలిగించాను. కళ్ళ ఎదట శవం! దారుణ హత్య! నాతల్లో శవం గిర్రున తిరిగింది. లిఫ్టు బోయి తిరిగాడు! అందుచేత కాస్సేపు ఏమీ చూడలేక పోయినాను.

డిటెక్టివు భూతాన్ని ఎవరో హత్య చేశారు. శవం పక్కమీద వెల్లికిలా పడుకుని నోరు తెరుచుకుని ఉన్నది. ఎక్కడా గాయంలేదు. నెత్తురు లేదు. గదికి ఉన్నది ఒకటే వాకిలి. అది మూసి ఉన్నది. లోపల గడియ పెట్టి ఉన్నది. అంతకుడు ఎట్లా లోపలికి వచ్చాడు? ఎట్లా చేశాడు? అన్నిటికన్న మిస్టరీ—ఎట్లా బయటికి వెళ్ళిపోయాడు?

"ఒక్క క్లూకూడా లేదే?" అన్నాను.

"సార్. ఒక్క క్లూ నేను ఇవ్వనా?" అన్నాడు లిఫ్టు బోయ్!

"చూస్తావెందుకు?" అన్నాను.

లిఫ్టుబోయి ఒక పెద్ద కత్తితీసి దాన్ని డిటెక్టివ్ భూతం గుండెల్లోకి దిగేశాడు. "మీరు కళ్లుమూసుకోండి, సార్!" అన్నాడు.

నేను మళ్ళీ కళ్ళు తెరిచేప్పటికి లిఫ్టుబోయ్ శవాకళ్ళల్లోకి చూసి నవ్వుతూ, "ఆకత్తి కోసం వెతకండి, సార్!" అన్నాడు.

"థాంక్స్."

ఇంతలో హోటల్ మేనేజరువచ్చి నన్ను చూసి హడిలిపోయాడు.

"నేను డిటెక్టివ్ కేయాన్‌ని. మీ హోటల్ ఆరోనెంబరు గదిలో డిటెక్టివ్ భూతం అనేఆయన హత్యచేయబడినట్టు బహుశా మీరు తెలియదనుకుంటాను," అన్నాను.

"ఎవ్వాడు, సార్?"

"హత్య చేయబడింది ఒక డిటెక్టివని మీరు మరిచిపోతున్నారు."

"[illegible]లి స్తైగదండీ మరిచిపోవటానికి?"

"ఇది మీ హోటలనేది జ్ఞాపకం ఉంచుకోండి. నే నడిగే ప్రశ్నలకి సూటిగా సమాధానాలివ్వటం మాకు మంచిది...అయిదో నెంబరు గదిలో ఎవరున్నారు?"

"ఇప్పుడెవరూ లేరు, సార్."

"హత్య జరిగినప్పుడెవరున్నారు?"

"చెబితే హోటల్ పరువుపోతుంది, సార్."

"మరి ఆరు పక్కన ఉన్న నెంబరేది?"

"రెండు, సార్."

"ఏడు నెంబరో?"

"మా హోటల్‌లో ఆరే గదులు, సార్."

ఆరుగదులూ నాతల్లో తిరుగుతున్నయి. లిఫ్టు బోయీ, మేనేజరూ, భద్రం కూడా తిరుగుతున్నారు. నాతలే రంకుల్రాటమైతే ఎంతడబ్బు సంపాయించేవాణ్ణో!

ఒక్కొక్కగదే పరీక్ష ఆరంభించాను. ఒకటో నెంబర్లో ఒక 60 ఏళ్ళ ముసలాయన ఉన్నాడు. మూడో నెంబర్లో ఒక 55 ఏళ్ళ మనిషి ఉన్నాడు. మూడో నంబర్లో 50 ఏళ్ళ వాడూ, నాలుగో నంబర్లో 45 ఏళ్ళ యువతీ, అయిదోనంబర్లో 40 ఏళ్ళ యువతీ ఉన్నారు.

"ఈ హత్యమాటేమిటి, సార్?" అన్నాడు యజమాని.

"ఇది పోలీసువారికి తెలియజేయటం మనవిధి. నిన్ను మాత్రం నేను కాపాడుతాను...ఈభూతాన్ని చూడటానికి ఎవరెవరు వచ్చారు?"

"రాత్రి తొమ్మిదిదాటినాక దివాళా బ్యాంకు కాషియరు వచ్చి అయిదు నిమిషాలు మాట్లాడి వెళ్ళాడు, సార్!"

ఒక్క దూకుతో టెలిఫోన్‌మీద పడి, "హలో!" అన్నాను. అవతల ఏదో గొంతు పలికింది. "దివాళా బాంకా? మాట్లాడేది కేయాన్-డిటెక్టివ్ కేయాన్. మీ కాషియరు కావాలి. మాట్లాడేది కాషియరా?...కాదా!" టెలిఫోన్ కిందపడేశాను.

ఇంతలో టకటక మెట్లమీద చప్పుడయింది. ఇనస్పెక్టరూ, ఇద్దరు పోలీసులూ వచ్చారు. "మిమ్మల్ని ట్రంకు చేద్దామనుకుంటూంటే మీరే వచ్చారు. ఈ కేసులో అంతకుడెవరని మీ అభిప్రాయం?"

"మీరుండగా మాకు అంతకుడి విచారం ఎప్పుడూ ఉండదు. ముందు శవాన్ని చూడాలి."

బూట్లు టకటక చప్పుడుచేస్తూ ఇనస్పెక్టరు ఆరోనెంబరు గదిలోకి వెళ్ళాడు. నేనుకూడా వెళ్ళాను.

శవాన్ని చూసి ఇనస్పెక్టరు వొణుకుతున్నాడు. నోటమాట రావటంలేదు. పాపం, శవమంటే ఎవరికన్నా భయం భయంగానే ఉంటుంది!

"ఇంత ఘోరహత్య నేనెప్పుడూ చూడలేదు. డిటెక్టివులనే హత్యచేసేవాళ్ళు బయలుదేరితే ఇక మా పోలీసుల గతేమిటి?" అన్నాడు ఇనస్పెక్టరు.

"ఈ కేసును నాకు వదలండి. అంతకుడెవరైందీ నాకు తెలుసనుకుంటాను. కాని అప్పుడే చెప్పటానికి వీల్లేదు. ఇంకా సాక్ష్యం కావాలి. మీరింటికివెళ్ళి పడుకుని నిద్రపోండి. సమయం వచ్చినప్పుడు నేను పిలుస్తాను."

ఇనస్పెక్టరు నన్ను థాంక్సు చేసి వెళ్ళిపోయాడు.

"భద్రం!"

"గురో!"

"దూకు!" ఇద్దరం హోటల్ మీదినించి కిందికి దూకి, తరవాత ఇద్దరమూ ఆటోలోకి దూకాం. ఆటోతోపాటు మేంకూడా దూసుకుపోతున్నాం.

ఆటో దివాళా బాంకు ముందాగింది. అర్థరాత్రి కావటంవల్ల బాంకులో జనం ఎవరూలేరు. కాషియర్ ఒక్కడే కూచుని నోట్లకట్టలు లెక్కపెట్టుకుంటున్నాడు.

"మీరు తొమ్మిదిగంటలకు హోటల్ రాకాసి కెందుకెళ్ళారు?" అడిగాను. అతను తెల్లబోవటం నేను గమనించగలిగాను.

"మీరు నన్నా ప్రశ్న అడగటం నాకెంతో ఆనందంగా ఉంది" అన్నాడు కాషియర్.

"మీరు డిటెక్టివ్ భూతాన్ని కలుసుకున్నారు!" అడిగాను. "మీరు నాతో మాట్లాడటం ఎంతో గొప్పగా భావిస్తున్నాను," చెప్పాడు.

ఇంతసేపూ నా తలలో తిరుగుతున్న ఏదో ప్రశ్నని ఆపి, తలలోనించి బయటికి తోసి లాగి, కాషియర్ దవడకేసి ఫెడేల్న కొట్టాను.

"మీరు డిటెక్టివు భూతాన్ని వదిలి రావటానికి ముందో వెనకో అతను హత్య చేయబడ్డాడు!" అన్నాను నోట్లకట్టల్లోకి తీవ్రంగా చూస్తూ.

"చాలా సంతోషం! చాలా సంతోషం!" అన్నాడు కాషియరు.

భద్రానికి చెయ్యి ఊపి శరవేగంతో పరిగెత్తి ఆటోలో దూకాను. అక్కడినుంచి హోటల్ రాకాసికి దూసుకుపొయ్యాం.

నాలుగో అంతస్తులో లిఫ్టు బోయ్ కనిపించి, "కేయాస్ గారూ, ఒక రహస్యం చూపిస్తా రండి!" చెబుతూ నన్ను అయిదో నెంబరు గదికి తీసుకుపోయాడు. అందులో 40 ఏళ్ళ యువతి పక్కమీద ఒత్తిగిల పడుకుని ఉన్నది.

"హత్య!" అన్నాడు బోయి.

"క్లూలో?!" అన్నాను.

బోయి నన్ను ఒక్కక్షణం ఆగమనిచెప్పి కత్తి తెచ్చి ఆమె గుండెల్లో పొడిచి, "అదుగో క్లూ!" అన్నాడు.

నేను మేనేజరు గదిలో దూకాను.

"హోటల్లో ఇంకా బతికున్న యావన్మందినీ పిలిపించండి," చెప్పాను.

అందరూ వచ్చి నా కెదురుగా నిలబడ్డారు. వారిలో ఒక్కతె మాత్రమే స్త్రీ, 45 ఏళ్లుంటాయి. మిగిలినవారిలో గదుల్లో ఉండే ముగ్గురు పురుషులూ, మేనేజరూ ఉన్నారు.

స్త్రీ కేసి తిరిగి "ఈ హోటల్లో ఈరాత్రి ఇప్పటికి రెండు హత్యాశ్చర్యమైన మరణాలు జరిగినయి. అంతకులు మాలో ఒకరై ఉండాలి, బయటివాళ్లు రావటానికి వీల్లేదు. ఎందుచేతనంటే హోటలు బయటి వాకిలి రాత్రి తొమ్మిదినుంచీ తాళం వేసే ఉంది. మీరు నిజం చెప్పేస్తే ఉరిశిక్షతో పోతుంది లేకపోతే—" ఆగాను.

"నేను స్నాటింగుకు పోయి పదకొండింటికొచ్చి పడుకుని నిద్రపోయాను. నాకేమీ తెలీదు," చెప్పింది స్త్రీ. మొహంమీది పంచరంగులను బట్టి ఆమె చెప్పింది నిజమే అనుకున్నాను. కాని ఆమె నటి అన్న విషయం నాకు వెంటనే గ్నప్తికివచ్చింది.

"అమ్మో, నిన్నెవడు నమ్మాడు? హత్యలు చేసి అంతకురాలు కానట్టు నటించగలవు. తొమ్మిదింటికే వచ్చి పదకొండుకు వచ్చినట్టు నటించగలవు. నిజం చెప్పు!" అని ఉరిమాను. నా గొంతు వింటుంటే నాకే గుండె అదలయింది.

"ఇంక మీరంతా వెళ్ళొచ్చు. నాకు అర్జంటు పని ఉంది" అంటూ కిందికి గెంటేశాను. ఆటో దూసుకుపోతోంది.

దారిలో ఎవరో చెయ్యెత్తాడు. ఆటో ఆగింది. సన్నగా పొడుగాటివాడు లోపలికి ఎక్కి రహస్యంగా, "రాయపేట, అంజలీరోడ్డుకు పోనీ!"

అన్నాడు. ఆటో అంజలీరోడ్డుకు దూసుకుపోయి తక్కున ఆగింది. ఎక్కినవాడు దిగి ఒక సందులోకి వెళ్ళాడు. నా చూపుల్ని వాడి వెంబడే పంపాను. వాడు మళ్ళా వచ్చి "మైలాపూర్ జమునా రోడ్డు!" అన్నాడు. ఆటో శరవేగంతో దూసుకుపోయి జమునా రోడ్డుదగ్గిర తక్కున ఆగింది. వాడు దిగిపోయాడు.

వాడికోసం చాలాసేపు చూసి ఆటోను మళ్ళీ హోటలుకు దూకాను. పైకి దూకాను. సినిమానటి! "ఏమిటి విశేషాలు?" కనుబొమలతో ప్రశ్నించాను. "నీకేం పొయ్యేకాలం? నా వెంటపడ్డావు?" అంటూ బాత్రూమ్ కేసి వెళ్ళింది. ఆ మనిషి చూస్తే డిటెక్టివ్లను కావలించుకునే మనిషిగా కనపడలేదు.

నావీపుమీద మళ్ళా ఏవో నిలబడ్డాయి. తీసి చూస్తే అవి లిఫ్టుబోయి చూపులు.

"సార్!" పిలిచాడు.

"ఏం?" పలికాను.

"మళ్ళీ రెండు హత్యలు!" దూకాను.

"ఒకటో నెంబరూ, రెండో నెంబరూ హతం!"

డబ్బాలోంచి చార్మినార్ సిగిరెట్లు అయిదు తీసి ఒకేసారి అంటించిలాగాను. పొగ హోటలంతటా వదిలాను. సిగిరెట్లు అవతల పారేసి ఒకటో నెంబరు గదిలోకి దూకాను. పక్కలో శవం! రెండో నెంబరు గదిలోకి దూకాను. డొక్కలో కత్తి! శవాలు నాతలలో రాకులరాటం తిరుగుతున్నయి.

"బోయ్!" పిలిచాను.

"సార్!" పలికాడు.

"ఈసారి ఏగది వంతు!"

"డిటెక్టివ్ కదా, మీకే తెలియాలి, సార్!"

"మూడూ, నాలుగూ! వాటిని ఒకకంట కని పెట్టి ఉండు."

టకటక! ఇనస్పెక్టర్!

"ఏమిటిది, కేమాన్! నువ్వున్నావుగదా అని ఇంటికిపోయి పడుకుంటే ఇట్లా చేశావ్?" అన్నాడు ఇనస్పెక్టరు.

"అంతవాణ్ణి విడుస్తాననుకున్నావా? వాడెవడో నాకిప్పుడు నమ్మకంగా తెలుసు. కాని తెల్లారేదాకా చెప్పను,' చెప్పాను.

"సరే నీయిష్టం!" నిట్టూర్చాడు.

"తెల్లారటానికింకా రెండుగంటలుంది. హోటల్లో ఇంకా ఇద్దరు బతికున్నారు! నువ్వు వెళ్ళి పడుకో."

బూట్లు టకటకలాడించుకుంటూ ఇనస్పెక్టరు వెళ్ళాడు.

"సార్!"

"ఏం?"

"మూడూ, నాలుగూ హతం!"

"అప్పుడే ఎట్లా కనిపెట్టావ్? అనుకుంటూనే ఉన్నాను!"

"మీరు చూడమన్నారుగదా, సార్!"

"అవును. థాంక్స్ యూ!" టెలిఫోన్ మీదికి దూకి, ఎత్తి, "అలోవ్!" పిలిచాను.

"ఇనస్పెక్టరు స్పీకింగు!"

"ఎక్కడున్నావ్? ఏంచేస్తున్నావ్?"

"కారెక్కి ఇంటికి పోతున్నాను."

"కృష్ణా! రథము మళ్ళించుము. అంతకుడు దొరికాడు, వెంటనే రా!"

టెలిఫోన్ కిందపడేసి మేనేజరు గదిలోకెళ్ళాను. డబ్బాలోంచి మినార్ సిగరెట్టు తీసి అంటించి ఘాటుగాలాగి సూటిగా పొగని మేనేజరు మీదికి వదిలాను! మేనేజరు తెల్లబోయాడు.

"ఇప్పుడైనా నిజంచెప్పు! ఒకటికాదు, రెండు కాదు, మూడుకాదు, నాలుగుకాదు, ఐదుకాదు, ఆరు శవాలు! అరెస్టు చెయ్యడానికి ఇనస్పెక్టరు వస్తున్నాడు."

"మీదగ్గిరదాచి లాభంలేదు, సార్! ఈసారికి నన్ను క్షమించండి, సార్!

"హా, హా, హా!" నవ్వాను. "క్షమించడమా? కల్లో మాట!"

"అయితే ఇదీ కల్లోమాటే!" అంటూ మరఫిరంగి తీసి నాకేసి గురిపెట్టి ఫటఫటా పేల్చసాగాడు. నా కళ్ళు చీకట్లయిపోయాయి! ఒళ్ళంతా ఒకటే చెమట్లు! నేను పడిపోతున్నాను... ఎక్కడికో... ఎందుకో! మరఫిరంగి హోరు మాత్రం అంతకంతకీ పెద్దదవుతున్నది...

• • •

తుళ్ళిపడి లేచికూచున్నాను. తెల్లవారొస్తోంది. మా ఇంటిపక్కగా ఏదో ఆటోరిక్షా వెళ్ళింది. భద్రం గురకపెట్టి నిద్రపోతున్నాడు. "చచ్చిపోయిన శవం" నలిగి నజ్జునజ్జయి ఉన్నది. ★